సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 23 । జనవరి । 2025



అంతా అస్తవ్యస్తం

పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారుతోంది. సంస్కరణల పేరిట కూటమి సర్కారు విద్యను నిర్వీర్యం చేస్తోంది. - 8లో



ఇదేం చోద్యం..!

నరసన్నపేటలో కూటమి కార్యకర్తలు మితిమీరి వ్యవహరిస్తున్నారు. స్థలాలు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. - 8లో

పదవీకాలం పెంపు

అరసవల్లి: జిల్లా మత్స్యకార సహకార సంఘం (డీఎఫ్‌సీఎస్) అధ్యక్షుల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు ఆ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎఫ్‌సీఎస్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ఈ ఏడాది జూలై 18 వరకు పొడిగించారు. కాగా జిల్లాలో డీఎఫ్‌సీఎస్‌గా పలాస మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ప్రాబబుల్స్ జట్లకు ఇదే మైదానంలో నాలుగు రోజులపాటు శిక్షణా శిబిరాలు నిర్వహించాక తుది జట్లను ప్రకటిస్తామన్నారు. జనవరి 28 నుంచి 31 వరకు విజయవాడలో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు వీరిని పంపిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి (సెల్: 99492 91288)ను సంప్రదించాలన్నారు.

గణతంత్ర వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డితో కలిసి వేడుకలు జరిగే శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానాన్ని పరిశీలించారు. 26న ఉదయం ఏడు గంటల నుంచి వేడుకలు మొదలవుతాయని చెప్పారు. కళాశాల మైదానం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు వేడుకలను తిలకించేలా సౌకర్యవంతమైన సిటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు, ఆహ్వానితుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేక స్టాళ్లు, శకటాలు సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, పద్మావతి, ఆర్‌డీఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, ఆర్‌ఐఓ పి.దుర్గారావు పాల్గొన్నారు.

హిరమండలం రిజర్వాయర్‌లో చేపల వేటకు లైసెన్స్

- తొలిసారిగా నిర్వాసితులకు అవకాశమిస్తూ జీఓ జారీ

అరసవల్లి: జిల్లా జీవనాడి వంశధార హిరమండలం రిజర్వాయర్‌లో చేపల వేటకు వీలుగా లైసెన్సింగ్ స్కీంను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని శంబర వెంగలరాయ రిజర్వాయర్ మాదిరిగానే...జిల్లాలో హిరమండలం రిజర్వాయర్‌లో తొలిసారిగా చేపల వేటకు లైసెన్స్‌లు జారీ చేస్తూ జీఓ 34ను విడుదల చేసింది. ఇకపై మత్స్యశాఖ తరఫున రిజర్వాయర్‌లో సీడ్ స్టాకింగ్ చర్యలు చేపట్టనున్నారు. వంశధార నిర్వాసితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధులకు మాత్రమే ఈ లైసెన్సులు ఇచ్చేలా పలు మార్గదర్శకాలను విడుదల చేశారు. దీంతో హిరమండలంలో ఉన్న 8 మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు రిజర్వాయర్‌లో వేట సాగించే అవకాశం దక్కనుంది. ఇందుకోసం ఆసక్తిగల వారు హిరమండలం మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ద్వారా లైసెన్స్‌లను పొందవచ్చునని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావు తెలిపారు. నిర్వాసితులైన సభ్యులకు లైసెన్సింగ్ స్కీం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ భవనంలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సెషన్‌లో 298 మందికి ఏడుగురు, సాయంత్రం సెషన్‌లో 295 మందికి ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులకు తనిఖీలు నిర్వహించాకే లోపలికి విడిచి పెడుతున్నారు.

జగదానంద కారకా..



ర్యాలీగా వెళ్తున్న రామ భక్తులు

టెక్కలి రూరల్ : అయోధ్యలో బాలరాముడిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం కోటబొమ్మాళి మండలం కొత్తపేటలో రామభక్తులు ర్యాలీ నిర్వహించారు. రైతుబజారు వరకు శ్రీరామ నామస్మరణ చేస్తూ ముందుకు కదిలారు. మధ్యాహ్నం సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు.



ధర్మాసుపత్రిలో మందులా.. ఆ ఒక్కటీ అడగొద్దు!

ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరత

- రిమ్స్‌లో పరిస్థితి మరింత దారుణం
- కీలక ఔషధాలు బయట కొనుగోలు చేసుకోవాలని సలహా ఇస్తున్న సిబ్బంది
- ప్రతి ప్రిస్క్రిప్షన్‌లో రెండు మూడు రకాలు దొరకని పరిస్థితి
- బయట కొనుక్కోలేక ఇబ్బందులు పడుతున్న రోగులు
- రోగుల క్షేమం పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:


చంద్రబాబు ప్రభుత్వం ధర్మాసుపత్రులను భ్రష్టుపట్టిస్తోంది. ఇప్పటికే ఖాళీ అయిన వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయకుండా, మౌలిక సౌకర్యాలు కల్పించకుండా, ఉన్న ఆసుపత్రులను కాపాడుకోకుండా నిర్లక్ష్యం చేస్తోంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని సైతం నిర్వీర్యం చేసింది. తాజాగా ప్రభుత్వాసుపత్రులకు మందులు(ఔషధాలు) సైతం సరఫరా చేయడం లేదు. భారీగా బడ్జెట్ తగ్గించేయడంతో మందుల కొరత నెలకొంది. వైద్యులు రాసిన దాంట్లో కొన్నింటిని బయట కొనుగోలు చేసుకోవాలని ఫార్మసీ సిబ్బంది బాహాటంగా చెప్పేస్తున్నారు. కూటమి సర్కారు వచ్చాక రిమ్స్ ఆసుపత్రికి కేటాయిస్తున్న మందుల బడ్జెట్‌ను పరిశీలిస్తే గతం కన్నా ఏ స్థాయిలో బడ్జెట్ తగ్గించేశారో ఇట్టే అర్థమవుతుంది. జిల్లా కేంద్రంలోని ప్రధానమైన రిమ్స్ పరిస్థితే ఇలా ఉందంటే.. అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రజారోగ్యాన్ని, రోగులను ఈ ప్రభుత్వం ఎంత చిన్న చూపు చూస్తుందో అవగతమవుతోంది. సంక్షేమ పథకాలను నిలిపేసినట్టే, వైద్యాన్ని కూడా వదిలించుకోవాలని చూస్తున్నట్టు స్పష్టమవుతోంది.



రిమ్స్‌లో మందులను ఇస్తున్న ఫార్మసీ వద్ద రద్దీ



రాగోలుకు చెందిన లక్ష్మీ అనే మహిళకు వైద్యుడు రాసిచ్చిన మందుల చీటి ఇది. ఆస్తమా సమస్యతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చింది. వైద్యుడికి చూపించుకుని, ఆయన రాసిన మందుల చీటి పట్టుకుని ఫార్మసీకి వెళ్తే నాలుగు రకాల మందులకు గాను ఒక రకం ఔషధమే ఇచ్చారు. అది కూడా అరకొరగానే.. మిగతావి బయట కొనుక్కోవాలని చెప్పారు. వాటిని కొనాలంటే రూ.2వేలు వెచ్చించాల్సిందే. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటోంది.

ఈయన పేరు సత్యంనాయుడు. పాలకొండ వాసి. ఈయన తండ్రికి వెన్నెముక నుంచి కుడి చేయికి విపరీతమైన నొప్పి వస్తుందని వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యుడు చూశాక కొన్ని మందులు రాశారు. వాటిని తీసుకునేందుకు ఫార్మసీకి వెళ్లగా డాక్టర్ రాసిన దాంట్లో నొప్పికి సంబంధించిన ఔషధం లేదని సిబ్బంది చెప్పేశారు. దీంతో నిరాశతో వెనుదిరిగి బయట కొనుగోలు చేసుకోక తప్పలేదు.

చిత్రంలో ఉన్న వారు అక్కా తమ్ముళ్లు. వీరిది జలుమూరు మండలం శ్రీముఖలింగం దగ్గర శ్రీమన్నాపురం. వీరిలో అక్క ముడిదాపు మంగమ్మ 20 ఏళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతూ మందులు వాడుతున్నారు. ప్రతి నెలా జిల్లా సర్వజన ఆసుపత్రి(రిమ్స్)కి వచ్చి వైద్యులను కలిసి నెలకు సరిపడా మందులను ఆస్పత్రి ఫార్మసీలోనే తీసుకుంటున్నారు. ఆమె సోదరుడు హర్షవిల్లి నాగరాజు కూడా ఫిట్స్‌తో బాధపడుతూ ఐదేళ్లుగా మందులు వాడుతున్నాడు. ప్రతి నెలా ఆస్పత్రికి వచ్చి వైద్యులను కలిసి అక్కడున్న ఫార్మసీలోనే నెలకు సరిపడా మందులు తీసుకుంటున్నాడు. అయితే వీరిద్దరికీ రెండు నెలలుగా ఫిట్స్ ఔషధమైన లెసిటామ్(ఎల్‌ఈసీఈటీఏఎమ్)ను ఫార్మసీలో ఇవ్వడం లేదు. ఆ మందును బయట కొనుగోలు చేసుకోవాలని చెప్పేశారు.



గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం మొదట్లో సరఫరా చేసిన మందుల రకాలు:	608
తదుపరి రివైజ్డ్ చేయగా సరఫరా చేసిన మందుల రకాలు :	712
ప్రస్తుత చంద్రబాబు సర్కారు సరఫరా చేసిన మందుల రకాలు :	359
సరఫరా నిలిపివేసిన మందులు:	30
ప్రస్తుతం అందుబాటులో ఉన్న మందులు:	329



ఈయన పేరు అజయ్. నరసన్నపేట వాసి. తన తల్లి ఫిట్స్ సమస్యతో బాధపడుతుండటంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రతి నెలా వైద్యుడికి చూపించి నెలకు సరిపడా మందులను తీసుకెళ్తుంటారు. అయితే, రెండు నెలలుగా ఫిట్స్‌కు అవసరమైన కీలక మందులను ఫార్మసీలో ఇవ్వడం లేదు. దీంతో బయట కొనుగోలు చేసుకుని వెళ్తున్నామని బాధపడ్డారు.



బయటే కొన్నాం..

కరోనా సమయంలో మా నాన్నకు గుండెలో రంధ్రం ఉన్నట్టు బయటపడింది. ఎడమ భాగం చాతికి, నడుముకు మధ్య చీము పట్టింది. అది ఇప్పుడు ఎక్కువ అవడంతో లోపలున్న చీము బయటకు తీసి క్లీనింగ్ చేయడానికి వైద్యుడు కొన్ని మందులు రాశా రు. వాటి కోసం రిమ్స్ ఆస్పత్రికి వెళ్తే కీలకమైన ఔషధం లేదని చెప్పడంతో బయట కొనాల్సి వచ్చింది.

– అసిరినాయుడు, రోగి కుమారుడు, ఒప్పంగి




ఈ చిత్రంలోని మహిళది ఆమదాలవలస. ఈమె భర్త కృష్ణమూర్తి అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. వైద్యుడికి చూపించుకుని మందుల కోసమని ఫార్మసీకి వెళ్తే కీలకమైన రెండు రకాల మందులు లేవని చెప్పేశారు. ఆ రెండింటిని బయట కొనుగోలు చేసుకోవాలని సిబ్బంది సలహా ఇచ్చారు. అందులో గుండె వ్యాధికి సంబంధించిన ప్రధాన ఔషధం కార్డివాస్ 3.125 లేకపోవడం గమనార్హం. పేదోళ్లం..తామెక్కడ కొనుక్కోగలమని ఆ మహిళ ఆ ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రిమ్స్ ఆస్పత్రికి మందుల బడ్జెట్ కేటాయింపులు ఇలా

2024 మొదటి క్వార్టర్‌లో(వైఎస్ జగన్ ప్రభుత్వం ఉన్న కాలం) బడ్జెట్	రూ.1.03 కోట్లు
2024 రెండో క్వార్టర్‌లో(వైఎస్ జగన్ ప్రభుత్వం ఉన్న కాలం) బడ్జెట్	రూ.1.03 కోట్లు
2024 మూడో క్వార్టర్‌లో(కూటమి ప్రభుత్వం వచ్చాక) బడ్జెట్	రూ.93.50 లక్షలు
2024-25(నాలుగో క్వార్టర్‌లో(కూటమి ప్రభుత్వం) బడ్జెట్	రూ.57.89 లక్షలు

● పగలు కట్టారు.. రాత్రి కూలగొట్టారు



అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద నిర్మించిన కాంక్రీట్ వాల్



అధికారులు లేకుండానే నిర్మించిన గోడను తొలగిస్తున్న కార్మికులు

- యథేచ్ఛగా ప్రజాధనం దుర్వినియోగం

రథసప్తమి వేడుకలకు జిల్లా కేంద్రాన్ని సుందరంగా తయారుచేయడం మాట అటుంచితే ప్రజాధనాన్ని మాత్రం యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ (సుడా) నుంచి సుమారు రూ.40 లక్షలకు పైగా నిధులు వెచ్చించి అరసవల్లి మిల్లు జంక్షన్‌తో పాటు పలు ప్రధాన కూడళ్ల వద్ద సుందరీకరణ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో మిల్లు జంక్షన్ వద్ద బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఫౌంటేన్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం కాంక్రీట్ వాల్ నిర్మించారు. ఏం జరిగిందో గానీ బుధవారం ఉదయమే విరగ్గొట్టేశారు. సరైన ప్లానింగ్ లేక, అధికారులు పర్యవేక్షణ లేక నిధులు వృథా చేస్తూ చేసిన పనులే మళ్లీ మళ్లీ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరోక్షంగా కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకే ఇలా లక్షలాది రూపాయలు వృథా జరిగేలా పనులు చేస్తున్నారనే పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హడావిడి పనులకు స్వస్తిచెప్పి పూర్తిస్థాయి పర్యవేక్షణతో పనులు చేయించాలని కోరుతున్నారు.

-శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

మహిళలు, చిన్నారులపై నేరాలు అరికట్టాలి

శ్రీకాకుళం క్రైమ్ : మహిళలు, చిన్నారులపై జరిగే కేసులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులపై దృష్టి కేంద్రీకరించాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ కె.వి.రమణతో కలసి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ఫిర్యాదులు, హిట్ అండ్ రన్ కేసులపై ఆరా తీశారు. గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. సీసీ కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాద కేసులు ఛేదించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, అడిషనల్ ఎస్పీ కె.వి.రమణ

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

సారవకోట: విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ తిరుమల చైతన్య సూచించారు. బుధవారం సారవకోట, అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థన సమయానికే సారవకోట హైస్కూల్‌కు చేరుకుని ఉపాధ్యాయుల సమయపాలన, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం అలుదు హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

కనిపిస్తున్న కట్టడాలన్నీ కూల్చేస్తారా?

- ఇల్లు కూల్చితే ఒప్పుకునేది లేదు
- ఎమ్మెల్యే శంకర్‌తో వాదనకు దిగిన ఇంటి యజమానులు

అరసవల్లి: రథసప్తమి సమీపిస్తున్న వేళ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాలన్నీ కూల్చివేతలతో నిర్మానుష్యంగా మారుతోంది. అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే దుకాణాల సముదాయాలు, అన్నదాన, ప్రసాదాల మండపాలను, వసతి గదుల సముదాయాలను కూల్చివేయగా.. ఆలయం ఎదురుగా ఉన్న పలు జిరాయితీ హక్కుదారుల ఇళ్లను సైతం కూల్చివేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆలయానికి ఎదురుగా ఉన్న భారీ ప్రహరీని కూల్చివేసిన తర్వాత.. ఆనుకుని ఉన్న ఇంటిని సైతం కూల్చివేసేందుకు సన్నద్ధమయ్యారు. దీంతో ఒక్కసారిగా ఇంటి యజమానులు, ఇరుగు పొరుగు వారు బుధవారం ఉదయం నుంచి ప్రతిఘటించారు. ఇదేంటని ఆలయ ఈవో వై.భద్రాజీని నిలదీశారు. రాష్ట్ర పండుగగా ఉత్సవాలు చేసుకోవాలని.. ఘనంగా రథసప్తమిని జరుపుకోవాలని... అలా అని కనిపిస్తున్న కట్టడాలన్నీ కూల్చివేస్తామంటే ఎలా అని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ అరసవల్లి చేరుకుని ఇంటి యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయానికి ఎదురుగా ఉన్న సుంకరి రమణమ్మ కుటుంబసభ్యులంతా తమకు ఆ ఇంటితో ఉన్న సంబంధాన్ని వివరిస్తూ.. ప్రాణాలను సైతం వదులుకుంటాం గానీ ఇంటిని వదులబోమని బదులిచ్చారు. దీంతో ఎమ్మెల్యే కాస్త వెనక్కి తగ్గి... ఇంటికి బదులు ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని ఇవ్వాలని కోరారు. కాసేపు చర్చల అనంతరం రమణమ్మ కుమార్తెలు ఖాళీ స్థలాన్ని ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. దీనికి బదులుగా ఆలయానికి చెందిన స్థలాన్ని ప్రత్యామ్నాయంగా అందజేస్తామని ఎమ్మెల్యే సమక్షంలో ఆలయ ఈవో వై.భద్రాజీ ప్రకటించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం మున్సిపల్ టౌన్ సర్వే, దేవదాయ శాఖ సర్వే అధికారుల బృందం సేకరించాల్సిన స్థలాల విస్తీర్ణాన్ని లెక్కించారు. మొత్తంగా 5.75 సెంట్ల స్థలాన్ని (పావు తక్కువ ఆరు సెంట్లు) మార్క్ చేసి మ్యాపింగ్ చేశారు. గురువారం నుంచి రహదారి నిర్మాణాన్ని చేపట్టేందుకు మున్సిపల్, ఆలయ అధికారులు సిద్ధం చేశారు.



అక్కడే మ్యాపింగ్ చేస్తున్న టౌన్ సర్వే బృందం



సేకరించనున్న ఖాళీ స్థలం ఇదే

ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాం..

ఆలయానికి ముందున్న ఇంటిని కాకుండా వెనుకున్న సుమారు ఆరు సెంట్ల స్థలాన్ని ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించనున్నాం. ఇందుకు ప్రత్యామ్నయంగా 80 ఫీట్ రోడ్డు, వప్పంగి రోడ్డులో పలు స్థలాలను ఇంటి యజమానులకు చూపించాం. వారి ఇష్టం మేరకు సరిపడిన స్థలాన్ని ఇస్తాం. ఇప్పటికే ఆర్డీవోతో చర్చించాం.

– వై.భద్రాజీ, ఆలయ ఈవో



ఇంటిని కూల్చనివ్వం..

ఆరు దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నాం. నా ముగ్గురు పిల్లలకు వెనుక ఖాళీ జాగాను పంచి ఇచ్చాను. రోడ్డు వేస్తామని ఇంటిని కూల్చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అడ్డుకునే సరికి ఇంటి వెనుక స్థలాన్ని మాత్రమే తీసుకుంటామని చెప్పారు. ఇంటిని మాత్రం ఇచ్చేది లేదని మా పిల్లలు కూడా తేల్చిచెప్పేశారు. 80 ఫీట్ రోడ్డులో స్థలాన్ని ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో ఇంటి వెనుక స్థలాన్నిచ్చేందుకు మా వాళ్లంతా ఒప్పుకున్నారు.

– సుంకరి రమణమ్మ, ఇంటి యజమాని

ఎల్లమ్మ గుడిలో నాగుపాము

కవిటి : మండలంలోని కపాసుకుద్ది పంచాయతీ పుటియాదళ గ్రామ పంటపొలాల్లో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి గుడిలో బుధవారం ఉదయం నాగుపాము కలకలం రేపింది. వాస్తవానికి ప్రతి గురువారం ఎల్లమ్మను దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో ముందురోజైన బుధవారం ఆలయం మొత్తాన్ని శుభ్రం చేస్తుంటారు. ఎప్పటిలాగే గుడి అర్చకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న ముత్యాల విమల.. అమ్మవారి పీఠంలో విగ్రహాల్ని బయటకు తీసి లోపలి పీఠం కడుగుతుండగా ఒక్కసారిగా పెద్దనాగుపాము పడగ విప్పి కనిపించింది. వెంటనే ఆమె భయాందోళనతో బయటకు వచ్చేసింది. రైతులు పామును బయటకు పంపించేందుకు ప్రయత్నించినా సఫలం కాకపోవడంతో విగ్రహాలను బయటే వదిలేసి వెళ్లిపోయారు.



పీఠంపై నాగుపాము

క్లుప్తంగా

సామగ్రి ధ్వంసంపై ఫిర్యాదు



ఆర్‌ఈఆర్‌ను పరిశీలిస్తున్న వంశధార, పోలీసు అధికారులు

టెక్కలి: వంశధార ప్రధాన కాలువలో టెక్కలి మండలం పరశురాంపురం గ్రామ సమీపంలో 40 ఆర్‌ఈఆర్ (రీచ్ అండ్ రెగ్యూలేటర్) సామగ్రి ధ్వంసం చేసిన వారిపై వంశధార అధికారులు టెక్కలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల షట్టర్ వద్ద గేర్ బాక్స్‌లు, స్క్రూగేర్లు తదితర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశధార డీఈ నవీన్, జేఈ భాస్కర్‌తో పాటు ఎస్‌ఐ రఘునాథరావు తదితరులు సంయుక్తంగా పరిశీలన చేశారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మరణించిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రైలు కిందపడి మరణించాడు. అతని ఎడమ చేతిపై ఎంబిటీఏ (మీటా) అని పచ్చబొట్టు వేసి ఉందని, అతని ఎడమ చాతిపై పాము గుర్తు, కుడి చాతిపై సిలువ గుర్తు ఉందని జీఆర్పీ పోలీసు అధికారి హరినాథ్ తెలిపారు. అయితే ఏ రైలు కింద పడి చనిపోయారు, ఏ ప్రాంతానికి చెందినవాడో తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు 94406 27567 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పాఠశాల విద్య.. అంతా అస్తవ్యస్తం

- సంస్కరణల పేరిట విద్యను నిర్వీర్యం చేస్తున్న కూటమి సర్కారు
- జీవో 117 ఉపసంహరణ పేరిట బురిడీ
- జిల్లాలో ఖాళీ కానున్న అనేక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు
- ఇంటర్ విద్యను అందిస్తున్న హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి
- మిగులు టీచర్ల సంగతి తేల్చని సర్కారు



తరగతి గదిలో పాఠాలు చెబుతున్న టీచర్

శ్రీకాకుళం న్యూకాలనీ:

పాఠశాల విద్యలో సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసేస్తోంది. అటు అధికారులను, ఇటు ఉపాధ్యాయులను గందరగోళానికి నెట్టేస్తోంది. ఇదేంటని ప్రశ్నించే ఉపాధ్యాయ సంఘాల బాధ్యులను భయపెడుతోంది. మెమోల పేరిట బెదిరింపులకు పూనుకుంటోంది. ఏకపక్ష నిర్ణయాలతో విద్యావ్యవస్థను కొంతమంది చేతుల్లోకి తీసుకోవాలనే యోచన చేస్తోంది. సర్కారీ బడుల పిల్లలను కార్పొ'రేట్'కు ధారాదత్తం చేసేలా చంద్రబాబు సర్కారు కుటిల యత్నాలు చేస్తోందని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

జీఓ రద్దు పేరిట గందరగోళం..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో సంస్కరణలు చేపడుతున్న అధికారులు అటు విద్యార్థులతోపాటు ఇటు ఉపాధ్యాయుల భవితవ్యంపై సరైన ప్రకటన చేయడం లేదు. జీవో నెంబర్ 117ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం చెప్పినప్పటికీ.. సవరణ ఉత్తర్వులు ఉపాధ్యాయులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సవరణ ఉత్తర్వులు మరింత అధ్వానంగా.. ఏకంగా పాఠశాల విద్యనే గందరగోళానికి నెట్టేసేదేలా ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వం తన నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమబాట తప్పదని వారంతా సూటిగా హెచ్చరిస్తున్నారు.

3, 4, 5 తరగతులు మరలా వెనక్కి..

గత ప్రభుత్వం జీవో 117ను అనుసరించి 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని ప్రాథమికోన్నత, హైస్కూల్స్‌లో విలీనం చేశారు. దీంతో 3వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చింది. ఈ విధానంలో ప్రాథమిక స్థాయి నుంచే విషయ పరిజ్ఞానం, విజ్ఞానం పెంపొందించేలా చేసే ఈ నిర్ణయాన్ని తల్లిదండ్రులు మెచ్చుకున్నారు. విద్యావేత్తలు కొనియాడారు. జిల్లాలో ఈ విధంగా 206 స్కూల్స్‌ను మెర్జ్ చేశారు. వీటిలో ప్రభుత్వ ఒకటి, ఎంపీపీ స్కూల్స్ 192, మున్సిపల్ ప్రైమరీ స్కూల్స్ 13 ఉన్నాయి. ఈ 206 ప్రైమరీ స్కూళ్ల విద్యార్థులను 176 హైస్కూల్స్‌లో మ్యాపింగ్ చేశారు. వచ్చే కొత్త విద్యాసంవత్సరంలో ఈ 176 పాఠశాలల్లో ఉన్న 3,4,5 తరగతుల విద్యార్థులను తిరిగి వెనక్కి తీసుకువచ్చి మోడల్, ప్రైమరీ పాఠశాలల్లో చేర్చనున్నారు.

హైస్కూల్ ప్లస్‌కు మంగళం..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్ విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన హైస్కూల్ ప్లస్‌కు కూటమి సర్కారు స్వస్తి చెప్పింది. జిల్లాలో ఆరు హైస్కూల్ ప్లస్ విద్యాలయాలు ఉన్నాయి. వాటిని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్‌లో భాగం చేయనున్నారు. దీంతో అక్కడ పనిచేస్తున్న పీజీటీలు పరిస్థితిపై స్పష్టత లేదు. ఈ లెక్కన జిల్లాలో 670 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు మిగులు టీచర్లుగా మిగిలిపోనున్నారు. ఇదే జరిగితే ముఖ్యమంత్రిగా మొదటి సంతకంతో.. మెగా డీఎస్సీ పేరిట ఇప్పటికే నిరుద్యోగులను దగా చేసిన చంద్రబాబు ప్రభుత్వం.. కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందా..? అనే అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

మోడల్‌స్కూల్ పేరిట 'సరికొత్త ఎత్తుగడ'..

పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను తీసుకురావాలని చూస్తున్నారు. 60 మందికి పైగా బాలబాలికలు ఉండే స్కూళ్లను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా కేటాయించాలని నిర్ణయించారు. జిల్లాలో 60 మంది విద్యార్థులు కలిగిన ప్రైమరీ స్కూళ్లు పట్టుమని మూడు కూడా లేవు. ఈ విధంగా మోడల్ ప్రైమరీ స్కూల్లు పేరిట ఉపాధ్యాయ పోస్టులను తగ్గించాలనే పన్నాగం పన్నారు. 60కిపైగా విద్యార్థులుంటే ఐదుగురు టీచర్లు, 60కి తక్కువుంటే కేవలం ఇద్దరు టీచర్లను నియమించాలనే కుయుక్తులకు శ్రీకారం చుట్టింది. ఈ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు బూటకంగా చూస్తున్నారు. విద్యార్థులుండే చోటు నుంచి ఒక కిలోమీటర్ దూరం వ్యవధిలోనే విద్యను అందించాల్సిందేనని విద్యాహక్కు చట్టంలో పేర్కొన్నప్పటికీ.. ఈ నిబంధనలను చంద్రబాబు సర్కారు పెడచెవిన పెడుతోంది. తాజా నిర్ణయాలతో రెండు మూడు కిలోమీటర్లు దూరం పోవాల్సిన పరిస్థితి దాపురించనుంది. అయితే అటువంటి విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు అందజేస్తామని ప్రభుత్వం పేర్కొంటుండటం కొసమెరుపు. కాగా ప్రభుత్వ నిర్ణయాలు, మార్గదర్శకాలపై న్యాయస్థానాలను ఆశ్రయించిన ఉపాధ్యాయులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని సమీక్షా సమావేశాల్లో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు హెచ్చరిస్తుండటం చర్చనీయాంశమవుతోంది.

ప్రభుత్వ తీరుతో పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: జీవో 117 రద్దు, సవరణలు పేరిట విడుదల చేసిన మెమో పూర్తి లోపభూయిష్టంగా ఉందని, ఇది మొత్తం ప్రభుత్వ విద్యావ్యవస్థనే కబళిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో జరిగిన ఎస్టీయూ జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 117 సవరణల మెమోలో 60 మంది పిల్లలు కలిగిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేయాలని, కానీ 60లోపు విద్యార్థులున్న పాఠశాలలను ఎప్పటిలానే యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వాటిలో 3,4,5 తరగతులను సమీప పాఠశాలల నుంచి మోడల్ పాఠశాలలో విలీనం చేయవద్దని, అలాగే 6, 7,8 తరగతిలో 50మంది పిల్లలు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్‌గా ఉన్నతీకరణ చేయాలని, 50 మంది విద్యార్థులు లేని ప్రాథమికోన్నత పాఠశాలలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలు ఉండాలని, సెక్షన్ వారీగా కాకుండా రోల్ ప్రాతిపదికన పోస్టులు ఇవ్వాలని, హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెద్దలు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి 117 జీవో సవరణలో లోపాలను సరిదిద్దాలని.. అంతవరకూ విద్యార్థులు మ్యాపింగ్ ఆపాలని, లేనిపక్షంలో ఎస్టీయూతో కలిసొచ్చేసంఘాలతో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎన్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎం.తేజేశ్వరరావు, కె.గడ్డెన్నాయుడు, మహిళా కార్యదర్శి వసంత కుమారి, పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

దళితులంటే ఎందుకంత కక్ష



మాట్లాడుతున్న పేరాడ తిలక్

- టార్గెట్ చేస్తూ దాడులు చేయడం సరికాదు
- మంత్రి అచ్చెన్నాయుడి డైరెక్షన్‌లోనే దాడులు
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్

టెక్కలి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి దళితులంటే ఎందుకంత కక్ష అని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ప్రశ్నించారు. బుధవారం టెక్కలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో సొంత సామాజిక వర్గం పోలీసు అధికారులతో దళితులను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడమే కాకుండా, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ దాడులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటబొమ్మాళి మండలం కిష్టుపురం గ్రామంలో దళిత కుటుంబం ఇంట్లోకి చొరబడి టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తే, వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయకుండా బాధితులపై పోలీసులు బెదిరింపులకు పాల్పడ్డారని మండిపడ్డారు. టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చుక్క గున్నమ్మ ఇంట్లోకి చొరబడి టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారని, ఈ ఘటనలో దాడి చేసినవారిని వదిలేసి బాధితులతో పాటు అదే గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం ఎం.నర్సాపురంలో దళితులపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తే, అక్కడ కూడా పోలీసులు ఏకపక్షంగా దాడి చేసిన వారికి మద్దతుగా నిలిచారన్నారు. తాజాగా నందిగాంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జడ్యాడ జయరాంపై అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారని దుయ్యబట్టారు.

టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు

దళిత కుటుంబాల్లో రాజకీయ చిచ్చు రేపుతూ మంత్రి అచ్చెన్నాయుడి డైరెక్షన్‌లో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారని తిలక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధం లేని తగాదాల్లో ఇరికిస్తూ పోలీసులతో అక్రమంగా కేసులు నమోదు చేయడమే కాకుండా, అన్యాయంగా అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. దళితులతో పాటు ఇతర సామాజిక వర్గాల్లో వ్యాపార వర్గాలను టార్గెట్ చేస్తూ కక్ష సాధింపులకు పూనుకుంటున్నారన్నారు. పోలీసులంటే తమకు ఎంతో గౌరవం ఉందని, అయితే అచ్చెన్నాయుడు తన సొంత సామాజిక వర్గానికి చెందిన పోలీసులను కక్ష సాధింపులకు వినియోగించుకోవడం బాధాకరంగా ఉందన్నారు. టెక్కలి నియోజకవర్గంలో పోలీసులు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. దళితులకు అండగా నిలబడి పోరాటం చేస్తామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ కురమాన బాలకృష్ణ, నాయకులు ఎ.విష్ణు, టి.నారాయణ, డి.కృష్ణారావు, బి.రాజేష్ ఉన్నారు.

ఒడియా బడులను విలీనం చేయవద్దు



మాట్లాడుతున్న బృందావన్ దొళాయి

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 117 రద్దు చేసిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఒడియా మాధ్యమం, ఒడియా సెక్షన్ ఉన్నటువంటి పాఠశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో విలీనం చేయవద్దని ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలంలోని సహలాలపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపోటా ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి మాట్లాడుతూ.. ఒడియా మాధ్యమం ఉపాధ్యాయులను ఇప్పటిలాగే ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. ఒడియా మాధ్యమం కొనసాగించడంతో పాటు 3 కి.మీ పరిధిలో ఒడియా మాధ్యమం ఉన్నత పాఠశాలలు లేని ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. 35 మంది విద్యార్థులున్న ఒడియా ప్రాథమిక పాఠశాలలను మోడల్ ఒడియా ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





రమణమూర్తికి సీపీఆర్ చేస్తున్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని దేవాది వద్ద జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన గరుగుబల్లి రమణమూర్తి (45) మృతి చెందాడు. తాను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయాలు కావడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రమణమూర్తి గృహాల్లో మార్బుల్స్ అమర్చే మేస్త్రీగా చాలాకాలంగా పనిచేస్తున్నాడు. దీనిలో భాగంగా నిమ్మాడలో గ్రానైట్ మార్బుల్స్ కొనేందుకు ఉదయం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా దేవాది వద్దకు వచ్చేసరికి ప్రమాదానికి గురయ్యాడు. కాగా ప్రమాదం జరిగిన కొద్దిసేపటి వరకూ ఎవరూ గుర్తించలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మడపాం టోల్‌గేట్ వద్ద ఉన్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించేసరికే మృతి చెందాడు. మృతుడికి భార్య పూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదంపై రమణమూర్తి సోదరుడు తవిటినాయుడు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

గూడ్స్ రైలు ఢీకొని రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవు

ఆమదాలవలస: మండలంలో దూసి రైల్వేస్టేషన్ పరిధి సమీపంలోని రైల్వే గేట్ వద్ద బుధవారం గూడ్స్ రైలు ఢీకొని రెండు ఆవులు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు దూసిపేట గ్రామానికి చెందిన దవళ యతిరాజులు సాయంత్రం వేళ పశువులను మేతకు తీసుకొని వెళ్లారు. ఇంతలో మేత మేసుకుంటూ ఆవులు రైల్వే గేట్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో సుదూర ప్రాంతానికి తుళ్లిపోయిన రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షలు విలువ చేసే ఆవులు తన కళ్లెదుటే మృతి చెందాయని యతిరాజులు కన్నీరుమున్నీరయ్యాడు. రైల్వే అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదేం చోద్యం..!

- పట్టాస్థలంలో కూటమి కార్యకర్తల నిర్మాణాలు
- లబోదిబోమంటున్న బాధితురాలు



పట్టా భూమిలో నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో కూటమి కార్యకర్తలు మితిమీరి వ్యవహరిస్తున్నారు. తమకు నచ్చినట్లు స్థలాలు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. శివనగర్ కాలనీలో 2007వ సంవత్సరంలో బి.శాంతి అనే మహిళ తల్లి అరసవల్లి కామరాజుకు అప్పటి తహసీల్దార్ దేవీమణి ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. తల్లి మరణానంతరం కుమార్తె శాంతి ఆధీనంలో ఆ స్థలం ఉంది. అయితే స్థోమత లేకపోవడంతో ఆమె నిర్మాణ పనులు చేపట్టలేకపోయింది. కాగా ఇప్పుడు కూటమి కార్యకర్తలు ఎమ్మెల్యే పేరు చెప్పి ఆ స్థలాన్ని ఆక్రమించుకొని, నిర్మాణ పనులు చేపడుతున్నారని శాంతి లబోదిబోమంటోంది. తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయింది. మొయ్యి విశ్వేశ్వరరావు, రావాడ వెంకటరావులు అక్రమంగా తన తల్లి పేరున ఉన్న పట్టా స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతోంది. అలాగే పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి వద్ద ప్రస్తావించగా ఆ స్థలం వివాదంలో ఉందని, పంచాయతీ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆ స్థలం ఎవరిది అనేది తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ రవాణాపై కేసు నమోదు



జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వ్యాన్

జలుమూరు: అక్రమంగా రవాణా అవుతున్న విద్యుత్ పరికరాలు, కేబుల్స్‌ను శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులు శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద మంగళవారం పట్టుకున్నారు. అయితే దీనిపై కేసు నమోదు చేసేందుకు నాటకీయ పరిణామాలు చోటుచేసుకోవడం విశేషం. ముందుగా పట్టుబడిన సామగ్రిని అధికారులు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అయితే శ్రీకాకుళం పోలీసులు సామగ్రి చల్లవానిపేట నుంచి వచ్చిందని, అందువలన అక్కడకే వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. వాస్తవంగా సరుకు ఎక్కడ పట్టుబడిందో అక్కడే కేసు నమోదు చేయాలి. కానీ అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు జలుమూరు స్టేషన్‌కు బదలాయించారు. అలాగే వీటిపై కేసు నమోదు కాకుండా టీడీపీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. నిబంధనల మేరకు సరుకు పట్టుబడిన రోజునే కేసు నమోదు చేయాలి, లేకుంటే శాఖా పరంగా ఇబ్బందులు పడతామని టెక్కలి డీఈఈ కె.విష్ణుమూర్తి స్పష్టం చేశారు. అయితే శ్రీకాకుళం రూరల్ పోలీసులు నమోదు చేయాల్సిన కేసును తమకు అప్పగించడం ఏంటని జలుమూరు పోలీసులు అసహనం వ్యక్తం చేశారు. అయితే డీఈఈ విష్ణుమూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాననడంతో తప్పని పరిస్థితిలో అదేరోజు రాత్రి చల్లవానిపేటకు చెందిన పాగోటి లక్ష్మణరావు, జి.రమేష్, జామి శ్రీనివాసరావులపై ఎస్ఐ బి.అశోక్‌బాబు కేసు నమోదు చేశారు. అక్రమంగా రవాణ చేస్తున్న ఈ పరికరాలు పాతపట్నం నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడివని సమాచారం.